క్లుప్తంగా

వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర కీలకం



కేక్ కట్ చేస్తున్న అప్పలనాయుడు తదితరులు

విజయనగరం ఫోర్ట్: వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర కీలకమని ఏపీ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎస్.అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ల్యాబొరేటరీలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా గురువారం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్స్ ఇచ్చే వైద్య నివేదిక ఆధారంగానే వైద్యులు చికిత్స అందిస్తారని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్‌లు కచ్చితమైన నివేదికలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీధర్, సురేంద్ర సాయి, దాసరి సత్యనారాయణ, పి.ఆదినారాయణ, శోభ గోవింద్, శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో చదవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కేసలి అప్పారావు

నెల్లిమర్ల: పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదువుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. స్థానిక కేజీబీవీ స్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయాల్లో ఒత్తిడికి గురికాకుండా ఉండాలన్నారు. చదువుతో పాటు ఆహారం, ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ఉమ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

18 కిలోల ప్లాస్టిక్ స్వాధీనం



తనిఖీ చేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: నగర పంచాయతీలో అధికారులు 18కిలోల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో షాపులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, శానిటరీ కార్యదర్శులతో ప్లాస్టిక్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో వారు ప్లాస్టిక్ వాడిన షాప్ వద్ద 18 కేజీలు ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని, రూ.2650 పెనాల్టీలు విధించారు. అలాగే పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో కలిగే అనర్థాలపై, పట్టణంలో ఎక్కడా పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లును విక్రయించకుండా నిషేధం అమలు చేయాలని, గుడ్డ సంచులను మాత్రమే వాడాలని వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కొండపేటలో ఉన్న గ్రామదేవత శ్రీ పూడమ్మతల్లి ఆలయ ఆరో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, నడిపేన నారాయణరావు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న సువ్వాడ వనజాక్షి, లెంక అప్పలనాయుడు, బైరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి తదితరులకు అర్చకులు కామేశ్వర శర్మ ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వనజాక్షి ప్రారంభించారు. కార్యక్రమంలో మజ్జి రాంబాబు, ఆల్తి తేజ, ముడిమంచి లక్ష్మణరావు, బైరెడ్డి రమణ పాల్గొన్నారు.

రూ.కోటి 23 లక్షల పన్ను వసూలు



పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో ప్రైవేటు ప్రాపర్టీలకు సంబంధించి ఆస్తి పన్ను ఈ నెల 13 నాటికి రూ.కోటి 23 లక్షలు వసూలు చేసినట్లు కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంకా రూ.25లక్షల వసూలు చేస్తామన్నారు. నీటి చార్జీలు రూ.33.57 లక్షలకుగాను రూ.22.98 బకాయిలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఖాళీ స్థలం పన్నులు రూ.6.58 లక్షలకుగాను రూ.4.27వసూలు కాగా రూ.2.31 బకాయిలు ఉన్నాయన్నారు. ఇంటి యజమానులు ఈ ఆర్థిక సంవత్సరం మరో 15 రోజుల్లో ముగియనుందని గడువులోగా త్వరితగతిన పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

పీ 4 సర్వేతో పేదల్లో ఆందోళన

- 27 రకాల ప్రశ్నలతో కుటుంబ సర్వే
- ఇంట్లో వస్తువుల వివరాల సైతం నమోదు
- సంక్షేమ పథకాలు తొలగిస్తారేమోనని అనుమానాలు



పీ-4 సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది

మండలం	సర్వే చేయాల్సిన కుటుంబాలు
పూసపాటిరేగ	18,380
డెంకాడ	13,849
నెల్లిమర్ల రూరల్	12,858
నెల్లిమర్ల అర్బన్	5,924
భోగాపురం	14,746



పూసపాటిరేగలో పని భారం తగ్గించాలని ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పూసపాటిరేగ : ఎన్నికలలో ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి సర్కారు తాజాగా గ్రామాలలో చేపడుతున్న పీ-4 సర్వేపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. కూటమి సర్కారు అధికారంలోకి వస్తే జీవితాలు మెరుగుపడతాయని ప్రజలను నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు ఊసెత్తడమే మరిచిపోయారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోలేదు. తాజాగా గ్రామాలలో జరుగుతున్న పీ-4 సర్వేపై రకరకాలుగా గ్రామాలలో రకరకాలు వదంతలు వస్తున్నాయి. సంక్షేమ పథకాలు ఎత్తివేయడానికే సర్వే జరుగుతుందనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో ఫోన్, ఏసీ, టీవీ, ఫ్రిజ్, బైక్, బ్యాంకు అకౌంట్‌తో పాటు 27 రకాల ప్రశ్నలు వేసి కుటుంబ సభ్యుల నుంచి ప్రశ్నలు రాబట్టి అప్‌లోడ్ చేస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలో 65,757 కుటుంబాలు వున్నాయి. వీరిలో దారిద్ర్య రేఖ దిగువన వున్న కుటుంబాలలో నెలవారి వాయిదాల్లో కొంత మంది, అప్పులు చేసి కొనుక్కోని ఇళ్లల్లో ఏసీలు ఏర్పాటు చేసుకున్నారు. ఏసీ ఉన్నట్లు సచివాలయం సిబ్బంది రికార్డులలో నమోదు చేస్తే ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతాయనే భయం చాలా కుటుంబాలను వెంటాడుతోంది. సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే భయం నెలకొంది. ప్రతి సచివాలయం ఉద్యోగి రోజుకు 200 కుటుంబాలకు సర్వే చేయాలనే ఆదేశాలు రావడంతో సచివాలయం సిబ్బందిలోను ఆందోళన నెలకొంది. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులను జావాబుదారీగా చేస్తూ మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్‌ఫ్రం హోం, హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్, డెత్ వెరిఫికేషన్, ఆరేళ్ల పిల్లలు ఆధార్ మిస్సింగ్ సర్వే, నాన్ రెసిడెన్షియల్ సర్వే, ఇంటి పన్ను, కొళాయి పన్నుతో పాటు పలు అంశాలపై కార్యదర్శులను బాధ్యులును చేయడంతో వర్క్‌లోడ్‌తో ఇబ్బంది పడుతున్నారు. సర్వేలో పొందుపరిచిన అంశాలు సాధారణ జీవన శైలిలో భాగమే అయినప్పటికి సర్వే ఎటుదారి తీస్తోందనే భయం ప్రజలను వెంటాడుతోంది. సర్వేకి నిరాకరించిన వారి పేర్లను సైతం పొందుపరచాలనే ఆదేశాలు ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నారు. పీ-4 సర్వే నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, దీనిపై పౌర సమాచారం ప్రభుత్వానికి అందుతోందని అధికారులు అంటున్నారు. సర్వే ద్వారా ఆర్థికంగా వెనకబడిన వర్గాలు గుర్తింపు కోసమే అని క్షేత్ర స్థాయిలో సిబ్బందికి ఉన్నతాధికారులు తెలియజేస్తున్నారు. పథకాలకు సర్వేకు ఎటువంటి సంబంధం లేదని, పథకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నా ప్రజల్లో మాత్రం కొంత అనుమానం వ్యక్తం అవుతోంది

సీబీఎం గర్ల్స్ హైస్కూల్ గుర్తింపు రెన్యువల్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిలాల్ అధ్యక్షుడు వాసు

విజయనగరం గంటస్తంభం: బొబ్బిలి పట్టణంలో ఉన్నటువంటి వందేళ్ల చరిత్ర కలిగిన సీబీఎం గర్ల్స్ హైస్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి స్కూల్ గుర్తింపు రెన్యువల్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.వాసు, కె.అప్పన్న జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారులను కోరారు. దాసరి నాగభూషణ్ అమర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం పూర్తి కావడంతో వచ్చే విద్యా సంవత్సర కాలానికి స్కూల్ గుర్తింపు రెన్యువల్ కాకపోతే విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. గత స్కూల్ కరస్పాండెంట్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణమే స్కూల్ గుర్తింపు రెన్యువల్ కోసం తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెలగాడ రాజేష్ ఉన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: మధుపాడ వాటర్ రిజర్వాయర్ నుంచి విజయనగరానికి నీటి పంపిణీ జరపాల్సిన 750 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైందని, దీంతో నగరంలో కొన్నిచోట్ల శుక్రవారం తాగునీటి పంపిణీకి అంతరాయం ఏర్పడనున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం ద్వారా తెలిపారు. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని పేర్కొన్నారు. పనులు పూర్తయిన వెంటనే ఆయా ప్రాంతాలకు నీటి పంపిణీ యథాతథం చేస్తామని తెలిపారు. 30, 35, 36, 38, 39, 40, 45, 46, 47 పూర్తి డివిజన్లలో, 41, 44 డివిజన్‌లలో కొన్ని ప్రాంతాలలో తాగునీటి పంపిణీకి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటి పంపిణీ చేపడతామన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రజలు సహకరించాలని కోరారు.

రుణాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరావు

విజయనగరం : స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న రుణాలపై విజయనగరం ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారిణి డి.అరుణ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారిణి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి సిబ్బందితో రుణాల మంజూరు, వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిరోధం, రీయూజ్డ్ ప్లాస్టిక్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అసంపూర్తిగా నిలిచిన గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వం అందజేయనున్న అదనపు సాయంపై వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంటా వెంకటరావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్రా కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెలా మూడో శనివారం గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, మండల, గ్రామ స్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుండెలాంటిదే కిడ్నీ..

- డాక్టర్ శ్రీకాంత్ జాడ



కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్‌కు సత్కారం

విజయనగరం: మన శరీరంలోని అన్ని అవయవాల్లో మూత్రపిండాలు కూడా అత్యంత ప్రధానమైనవని, అవి పనిచేయకపోతే మన శరీరంలో అనేక అవయవాలు దెబ్బతింటాయని ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ జాడ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉండేది పిడికెడే అయినా కిడ్నీలు చేసే పనులు చాలా గొప్పవన్నారు. శరీరం పరిశుభ్రంగా ఉండేలా.. సక్రమంగా, సజావుగా పనిచేసేలా చూస్తాయని మనకోసం నిరంతరం ఇంతగా శ్రమించే కిడ్నీలను కాపాడుకోవటం మన విధిగా భావించాలన్నారు. అనేక ఆరోగ్య సమస్యలు కూడా కిడ్నీలపై ప్రభావం చూపిస్తాయని, అందుకే ఆరోగ్యంగా ఉంటేనే కిడ్నీలు సరిగా పని చేస్తాయని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌ను పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, సంఘం అధ్యక్షుడు గురు ప్రసాద్ తదితరులు ఘనంగా సత్కరించారు.

హెల్మెట్ ధరించండి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

విజయనగరం టౌన్: హెల్మెట్ ధరించడం వలన ప్రాణనష్టం నుంచి బయటపడగలమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వేములి వెంకటరావు అన్నారు. స్థానిక సీతం కళాశాల రోడ్డులో హైవేపైన హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేసే వారికి హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను, ధరించకపోతే జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు గత కొద్ది రోజులుగా జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణాలు చేసే వారికి ముందుగా అవగాహన కల్పిస్తామని, రెండోసారి హెల్మెట్ లేని ప్రయాణాలు చేస్తే రూ.1000 జరీమానా విధిస్తామన్నారు. వాహనాలకు నంబరు ప్లేట్స్ తప్పనిసరిగా నిబంధనలకనుగుణంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వాహనచోదకులు, ఆర్‌టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

తాటిమాను చెరువులో పారిశుధ్య లోపం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామంలో తాటిమాను చెరువు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రాస్‌గా మారింది. ఇటీవల రామతీర్థం పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా జాతర జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన మత్స్యకారులు చెరువు ప్రాంగణంలో గుడారాలు ఏర్పాటు చేసుకొని భక్తి శ్రద్ధలతో జాగారాలు చేశారు. దీంతో చెరువు ఆవరణలో పూర్తి స్థాయిలో పారిశుధ్యం లోపించింది. చెరువు నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు నిండుకొని స్వచ్ఛ భారత్ లక్ష్యానికి తూట్లు పొడుస్తోంది. జాతరలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టామని గొప్పలు చెప్పుకున్న అధికారులు రోజులు గడుస్తున్నా చెరువును శుభ్రం చేయకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. చెరువు ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్తులో డ్రోన్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ శ్రీనివాసన్

నెల్లిమర్ల రూరల్: భవిష్యత్తులో డ్రోన్లు కీలక పాత్ర పోషించనున్నాయని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ శ్రీనివాసన్, ప్రొఫెసర్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంతో సంయుక్తంగా డ్రోన్స్ వినియోగంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిమోట్ పైలెట్ ట్రైనింగ్ సంస్థ ఉపాధి అవకాశాలను వివరించారు. రానున్న కాలంలో డ్రోన్లు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విద్యార్థులు డ్రోన్ల రంగంలో పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

20న యేసు పునరుత్థానం ర్యాలీ

విజయనగరం టౌన్: ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానం ర్యాలీని ఈ నెల 20న భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ సంస్థ వ్యవస్థాపకులు విజయవాడకు చెందిన రెవరెండ్ జి.దేవరాజు తెలిపారు. పట్టణంలోని అంబటి సత్రం వద్దనున్న యేసు ప్రేమాలయంలో ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కోట వద్ద నుంచి ర్యాలీని ప్రారంభమై పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లను కలుపుతూ తిరిగి కోట వద్దకు చేరుకుంటుందన్నారు. ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెవరెండ్ సురేష్‌బాబు ఉండవల్లి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

విజయనగరం : కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ కలెక్టర్ చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ విజయనగరం పార్లమెంట్ కన్వీనర్ శంబర లక్ష్మీ నరసింహా పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ

డెంకాడ : మండలంలోని డెంకాడ గ్రామంలో బంగారమ్మ పండగ ఘనంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధ కార్యక్రమంలో ప్రజలు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు జరిగాయి. పరుగు ప్రదర్శనలో పలువురి ఎడ్ల బళ్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. విశాఖ జిల్లా చుక్కపల్లికి చెందిన సోమాలమ్మ తల్లి బండి మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో దేవరాపల్లి శ్రీ వీరాజనేయ, వల్లంపూడి ఎ.సత్తిబాబు బండి తృతీయ స్థానంలో నిలిచింది. వీరికి వరుసగా రూ.20వేలు, 15వేలు, 10 వేలు నగదు బహుమతి అందజేశారు. ఆర్.బంగారిబాబు, ఆర్.భాను, పాండ్రంకి ఆదినారాయణ నగదు సమకూర్చారు. ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు బాల్యం నుంచి అలవరుచుకోవాలి

- సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు



శిక్షణ ప్రక్రియలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు

విజయనగరం అర్బన్: నాయకత్వ లక్షణాలు బాల్యం నుంచి అలవరుచుకోవాలని అందుకోసం పాఠశాల స్థాయిలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు సూచించారు. స్థానిక భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో 'జట్టు నాయకత్వ శిక్షణ శిబిరం' పేరుతో ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి ఉన్నతస్థాయికి చేరాలంటే బాల్యం నుంచి ప్రకృతి పరిశీలన, అధ్యయనం, పరిశోధన అవసరమని సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ ద్వారా విద్యతో పాటు ఉన్నత విలువలు, ఆత్మవిశ్వాసం అలవాటవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్లు ఈపు విజయ్‌కుమార్, కె.సౌభాగ్య లక్ష్మి, జిల్లా సహ కార్యదర్శి ఎస్.కనకలక్ష్మి, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ (గైడ్) కె.గాయత్రి, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ (గైడ్) ఎ.కనకలక్ష్మి, జిల్లా ట్రైనింగ్ కౌన్సిలర్ పీవీ శర్వాణి, ఏఎస్‌ఓ సీకే దుర్గా నాగేశ్వరరావు, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ బి.ఎర్రమ్మ అండ్ ఎస్కార్ట్ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయి వసూళ్లలో అధికారులు



విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయిల వసూళ్లలో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఓవైపు, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు మరోవైపు ఇలా నగర వ్యాప్తంగా పర్యటిస్తూ మొండి బకాయిలను వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీర్ఘకాలంగా అధిక మొత్తంలో బకాయి పడిన పన్నులను వసూలు చేసేందుకు నడుం బిగించారు. శతశాతం పన్ను వసూలే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. – విజయనగరం

మండుటెండలో..



వేసవి ఉష్ణోగ్రతలు మార్చి రెండో వారంలోనే తమ ప్రతాపం చూపిస్తున్నాయి. గురువారం విజయనగరంలో ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం పది గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాలేదు. రానున్న రోజులను తలచుకొని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని హడలిపోతున్నారు. ఇదిలా ఉంటే కోట ప్రాంతంలో ఓ బ్యాటరీ ట్రై సైకిల్‌పై ఓ దివ్యాంగుడు గొడుగు నీడన తన ప్రయాణం ఇలా సాగించాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షునిగా ఆశపు వేణు



నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు

విజయనగరం: పార్టీ బలోపేతంలో భాగంగా వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా సంస్థాగత నియామకాలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు నూతనంగా నియామకమైన నాయకుల పేర్లను పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. ఇందులో భాగంగా విజయనగరం నగర పార్టీ అధ్యక్షునిగా ఆశపు వేణుకు మరోమారు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత 12 ఏళ్లుగా నగర పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేణుకు బాధ్యతలు అప్పగించటం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

15న స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ



సమావేశంలో మట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం కార్పొరేషన్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టాలన్నారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రజలకు తెలిసే విధంగా స్ఫూర్తిదాయకంగా ర్యాలీ నిర్వహించాలన్నారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సామూహిక పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధాన మార్కెట్లో ప్లాస్టిక్ రహిత ప్రాంతంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.